# నగల పెట్టి

కొవ్వూరు రాజు గారి నగల పెట్టె పోయిందిట.

రాజు గారి చేతిలో ఉండగానే పోయింది.

ఆయన చేతిలోని పెట్టె పోవడమే కాదు ఎలావచ్చిందో ఆయన చేతిలోకి అలాంటిదే బ్రీఫ్ కేసు వచ్చింది.

అంతా ఆశ్చర్యపోతున్నారు.

ఆరు అడుగుల పొడవూ గంభీరమైన పెర్సనాలిటీ, ఆయన్నే మోసం చేసారంటే పెద్ద కిలాడీయే అయి ఉండాలి. స్టేషన్‌లో అంతా చెప్పుకోవడమే.

రైల్వే ప్లాట్‌ఫారం అంతా పోలీసులు గాలించారు. అయినా లాభంలేకపోయింది.

రాజుగారి బంధువులు అంతా పెళ్ళికని బయలుదేరే ముందు, వారివీ, వారి ఇంటికి వచ్చిన వారివీ, అన్నీ భద్రంగా ఉంటాయని, ఒక పెట్టెలో పెట్టి, ఆ పెట్టె జాగర్తగా రాజు గారికి ఇచ్చారు.

ఫస్టు క్లాసు పెట్టెలోంచి, బెజవాడ స్టేషన్‌లో అంతా దిగారు.

అప్పటికే మగ పెళ్ళివారు వస్తున్నారని, చిన్నకార్లు నాలుగు తీసుకువచ్చి, రండి రండి అంటున్నారు. అంతా కార్లు ఎక్కబోతున్నారు. ఇంతలోనే, రాజు గారు ఒక్కకేక పెట్టారు. "నా బ్రీఫ్ కేసు-నగలున్న బ్రీఫ్ కేసు పోయింది, ఇది నాచేతిలోకి ఎలావచ్చిందో కాని, నాదికాదు"అంటూ అరిచారు. తీరా పెట్టె తెరిచి చూస్తే ఒక జత బట్టలు పది రూపాయలు ఉన్న పర్సు ఉంది.

"అందరినగలూ, జాగర్తగా ఉంటాయని మీచేతికిచ్చాం" అని ఆడవారంతా ఏడ్చేసారు. దాంతో పోలీసులను పిలిపించారు. స్టేషనంతా వెతికించారు. ఎక్కడా దొంగ దొరకలేదు. అవతల పెళ్ళివేళ తప్పిపోతుందని, నిరాశతో వెళ్ళారు. పెళ్ళివారంతాను. రాజుగారు తమ నగల పెట్టె పోయిందని, కేసు నమోదు చేయించారు. పది రోజులైంది. సి.ఐ.డి.లు కూడా వచ్చారు. ఏంలాభం లేకపోయింది.

"రాజు గారికి మినిష్టర్ లెవెల్లో పలుకుబడిఉందట. దొంగని పట్టుకోలేక పోయారో? ఆ నగలు దొరక్కపోయాయో మన ఉద్యోగాలు పోతాయి జాగర్త!" అని పై అఫీసర్ నుంచి వార్త వచ్చింది. అది విని గజగజ వణికారు అంతాను.

ఇంతలోకే వైజాగ్ నుంచి పైఆఫీసర్ సడన్‌గా విజిట్ చేయడానికి వచ్చాడు. జరిగిందంతా చెప్పి "ఇంక, మావల్ల కాదు, ఈ కేసు పట్టు కోవడం" అని చెప్పేసాడు సబిన్స్పెక్టర్. "అయితే ఈ కేసు పట్టుకోగలిగినవాడు. వరంగల్లులో పని చేస్తున్న వెంకట్రావు. సి.ఐ.డీ. ఇనస్పెక్టర్.అతణ్ణి నియమిస్తే పనిజరుగుతుంది. అతన్ని వెంటనే వచ్చి, ఇక్కడ జాయిన్ అవ్వమంటాను. కేసంతా అతనికి అర్ధ మయ్యేటట్లు చెప్పండి." అని జీప్ ఎక్కి వెళ్లిపోయాడు ఆఫీసర్- ఏర్పాట్లు అన్నీ చేసి-

తైల సంసారంలేకుండా, జుట్టు అంతా రేగిపోయి, చేతిలో పాత సీవెండి గిన్నెతో రైల్వే స్టేషన్‌లో బెంచీ మీద పాతనిక్కరుతో కొంచెం చిరిగిన చొక్కాతో, కూచుని ఉన్నాడు ఓ ముష్టివాడు.

ఎదురుగుండా కేంటిన్‌లో ఇడ్లీ, వడా, కాఫీ అంటూ అరుపులు వినిపిస్తున్నాయి. కాంటీన్ యజమాని, పని కుఱ్ఱాడూ ముష్టివాడికేసే చూస్తున్నారు.

"ఈ బిచ్చగాడు ఎవడురా? రెండు రోజులనుంచి ఇక్కడే కనిపిస్తున్నాడు?" అనుకున్నారు.

ఆ మాటలు బిచ్చగాడి చెవిని పడ్డాయి. వాళ్లచూపులు కూడా, తనకేసే, పరిశీలనగా చూస్తున్నాయి అని, మెల్లగా లేచి స్టేషన్‌కి అటువైపు బెంచీ మీదకి వెళ్ళి కూర్చున్నాడు. లంక పొగాకు చుట్టలు కాలుస్తూ, పంచెకట్టులో ఇద్దరు ఈ బెంచీకేసి వచ్చి ఎవఁడ్రా వీడు ఇక్కడ కూర్చున్నాడు? " లే, లే," అని అరిచారు.

చూడ్డానికి చిన్నరకం రైతుల్లా ఉన్నారు అనుకుని "చిత్తం బాబయ్యా" అంటూ లేచి ఇవతలిగా అటు తిరిగి నుంచున్నాడు, ఆ ముష్టివాడు.

"ఇదిగో ఇలాంటి వాళ్ళే రైలువచ్చేటప్పటికి వెళ్ళి ఆ జనంలో దూరి ఏ పెట్టో పట్టుకుపోతారు" అన్నాడు, వాళ్ళలో ఒకడు కోపంగా.

"అవునూ, ఆ మధ్యన కొవ్వూరి రాజుగారి పెట్టె దొరికిందా" అన్నాడు చుట్టపొగ పీలుస్తూ రెండోవాడు.

"పోలీసువాళ్ళు పూర్వంలాగా నిజాయితీగా లేరుకదా? ఇంకా దొరకలేదట" అన్నాడు. "ఎవరు ఎత్తుకుపోయారో ఏమో వంద కాసుల బంగారంట, భార్యవీ చుట్టాలవీ. అందరినగలూ నేను జాగ్రత్తగా పట్టుకువస్తాను, అన్నాట్ట. పేరు రాజుగారంటున్నావు. ఆరికి దివాణంఉందా?" అన్నాడు.

"అబ్బే, కాస్త డబ్బు ఎక్కువ ఉంది, రాజుగారి పేరు చూసి, పెద్దరాజు అనుకునేవు?" అన్నాడు.

"అయినా రాజుగారి చేతిలో ఉన్న పెట్టె ఎవరు లాగెయ్యగలరు? అంతుచిక్కటంలేదు పోలీసులకి కూడాను."

ముష్టివాడు వాళ్ళ మాటలు జాగ్రత్తగా వింటున్నాడు.

అతను మళ్ళీ చెప్పడం మొదలు పెట్టాడు.

"ఆవాళ కూడా ఇలాగే చుట్ట కాల్చుకుంటూ కూచున్నాను. పెళ్ళివారంతా ఫస్టుక్లాసు పెట్టెలోంచి, బిలబిలమంటూ, ఆడామొగా అంతా దిగారు. స్టేషన్‌లోని వారంతా, ఆశ్చర్యంగా చూసారు. ఆ ఆడవారి అందం ఏమిదర్జా ఏ సినీమా యాక్టర్లలానో ఉన్నారు. దిగి వచ్చిన దేవతల్లా ఉన్నారనుకో! ఈ ముష్టివాడు మన మన మాటలు వింటున్నాడు. ఇంక నేను చెప్పను. రాపోదాం" అంటూ వెళ్ళి పోయారు.

ముష్టివాడు అటుతిరిగి. ఇటు తిరిగి. మళ్ళీ కేంటిన్‌కి ఎదురుగా ఉన్న బెంచీ మీద కూచున్నాడు.

ఇంతలోకీ, వాల్తేరు నుంచి పేసింజరు వచ్చింది. జనం హడావిడిగా తిరుగుతున్నారు. రైలు ఎక్కేవారూ దిగేవారూను, ముష్టివాడు కూడా జనంలోకి వెళ్ళాడు.

ఇంతలో ఓ ముసలి దంపతులు. సామానుతో దిగారు. పోర్టర్‌ని కేక వేసారు, పెట్టె తీసుకునిరమ్మని.

"ఇంత పెద్ద పెట్టె ఏంటండీ బాబూ" అన్నాడు.

"చిన్న చిన్న బ్రీఫ్ కేసులు అయితే పోతాయని. ఈ మధ్యన ఇలాగే ప్రయాణం చేస్తున్నాము" అన్నారు వాళ్ళు.

"ఆ అన్నట్లు కొవ్వూరు రాజుగారి నగల పెట్టె దొరికిందా?" అన్నాడు ఆ ముసలాయన.

"దొరకలేదండీ, ఆ రోజు వారి పెట్టెలన్నీ వాళ్ళ పాలేరులు దింపారండి" మాతప్పులేదు అన్నట్లుగా అంటూంటే వెనుకనుంచి-

"ఆ పెట్టెలు దింపేటప్పుడు రాజుగారు అక్కడే వున్నారా? దిగిన వెంటనే స్టేషన్ బైటికి వెళ్లారా?" ఓ బొంగురు గొంతుక అడిగింది?

"ఆ కేంటీన్ ఎదురుగుండానే కదండీ ఆళ్ళూ పెట్టెలూ, దిగుతా" అని "ఎవరూ? అడుగుతా" అంటూ వెనుతిరిగాడు.

ముష్టివాడు జనం వెనక్కి వెళ్ళిపోయాడు.
పోర్టర్‌కి ఎవరో అర్థంకాలేదు.
ముష్టివాడు మెల్లగా నడుచుకుంటూ తన చేతిలోని సంచీని భుజాన తగిలించుకుని విసుగ్గా నీరసంగా నడుస్తూ. "ఈ కేసు పట్టు కోవడం కష్టంగానేఉంది. ఈవేషంలో విసుగొస్తోంది. అమ్మ అనేది. " దేశంలో ఇన్ని ఉద్యోగాలు ఉండగా ఈ పోలీసు డిపార్టు మెంటులో జేరావెందుకురా? అని.
నిరాశగా, ఆలోచిస్తూ "రైలు దిగింది లగాయతూ, నగల పెట్టి చేతిలోనే ఉంది. స్టేషన్ బైటికి వెళ్ళి అందరితో మాట్లాడుతూ, పెళ్ళివారు తీసుకువచ్చిన కార్లో ఎక్కబోతూ, పెట్టి తేలిగ్గా ఉందేమిటి? అని భయపడి పెట్టి తీసి చూసాడు. ఆపెట్టెలో నగలు లేవు సరికదా? ఒక జత బట్టలు గెడ్డం గీసుకునే సామాను, చిన్న పర్సు ఉంది. ఆశ్చర్యపోయాడు రాజుగారు, ఇదీ, తనకి దొరికిన ఇన్‌ఫర్ మేషన్, ఇది గట్టి కేసే, దొంగ దొరకటం కష్టంగా ఉంది" అనుకుంటూ, సి.ఐ.డి. ఇనస్పెక్టర్ వెంకట్రావు కాంటిన్‌లోంచి వచ్చే కేకలు విన్నాడు "కొట్టకండి బాబూ, కొట్టకండి" అని ఆ పదేళ్ళ కుర్రాడు కేంటిన్ యజమానికి దణ్ణం పెడుతున్నాడు.
అందరూ చూస్తూ ఊరుకున్నారు. ఒకళ్ళూ కుర్రాణ్ణి అంతలా కొట్టకు అనలేదు. సంజ చీకట్లు కమ్ముతున్నాయి. స్టేషన్‌లో జనం పలచబడ్డారు.
కేంటిన్‌లో కుర్రాడు ఎక్కెక్కి ఏడుస్తున్నాడు.
వాడి జేబులు తడిమి డబ్బులు తీస్తూ "దొంగ వెధవా? తిండి నేనే పెడుతున్నాను. బట్టలు నేనే కుట్టిస్తున్నాను. ఈ డబ్బులు దొబ్బడం దేనికిరా?" అంటూ మళ్ళీ కొట్టాడు.
ఆ కుర్రాడు ఏడుస్తూ "నీ దగ్గర నేను పనిచేయను. నువ్వే నన్ను దొంగని చేసావు" అంటూ ప్లాటుఫారం చివరకి, చీకటిలోకి వెళ్ళి పోయాడు.
"పోతే పోరా! ఇలా ఎన్ని సార్లో అన్నావ్." అన్నాడు యజమాని.
సి.ఐ.డి. వెంకట్రావుకి ఆకుర్రాణ్ణి చూస్తే జాలేసింది. వెనకాలే వెళ్ళి సీవెండిగిన్నెతో మంచి నీళ్ళు పట్టుకుని, వాడి దగ్గిరికి వెళ్ళి "బాబూ ఏడవకు. ముందు ఈ మంచి నీళ్ళు తాగు" అన్నాడు జాలిపడుతూను.
" నాకు వద్దూ" అంటూ ఏడుస్తున్నాడు.

" నీకు అమ్మా నాన్న లేరా?" అని అడుగుతూనే వాడు చేత మంచినీళ్ళు త్రాగించి, ఆదరంగా బుజ్జగించాడు, వెంకట్రావు సి.ఐ.డి.
ఆకుర్రాడికి మనసంతా కృతజ్ఞతతో నిండిపోయి. మళ్లీ బావురుమని ఏడ్చేసాడు.
" ఊరుకోబాబూ," అని బుజ్జగించాడు, తల నిమిరాడు వెంకట్రావు.
"రెండు ఇడ్లీ పొట్లాల డబ్బులు జేబులో వేసుకున్నానని కొడుతున్నాడు. రోజల్లా గొడ్డు చాకిరీ చేయిస్తాడండి" ఏడుస్తూ ఆకుర్రాడు చెబుతూంటే వెంకట్రావుకి జాలేసింది.
"ఏడవకు నీకు వేరే పని ఇప్పిస్తాను. నీకు అమ్మా నాన్నా లేరా?" అన్నాడు.
"మా అమ్మే ఉందండి. చిన్న చిన్న దొంగతనాలు చేసేవాడిని, దాంతో, ఇరుగూ పొరుగూ వచ్చి మా అమ్మకి చెప్పేవారు, దాంతో కొట్టేది అన్నంపెట్టేది కాదు. నీ మూలాన మిగతా పిల్లలు కూడా పాడైపోతారు అని కొట్టేది. బడికి వెళ్ళమంటే వెళ్ళ బుద్ధి అయ్యేది కాదు, ఒక రోజున ఇంట్లోంచి పారిపోయి వచ్చేసానండి. ఎండా కాలం ఆకలి మండిపోతోంది కడుపులో. ఈ కేంటీన్ యజమానిని అడిగితే ఇడ్లీ పెట్టాడు." ఇక్కడే ఉండి పని చెయ్యి అన్నం కూడా పెడతాను". అన్నాడు. నాకది ఇష్టం లేక రైల్లో అడుక్కుందామని వెళ్ళాను. అప్పటికే అందరూ దిగిపోయారు. ఒక బ్రీఫ్ కేసు కనిపించింది. అది తీసుకుని, రైలుదిగి దూరంగా వెళ్ళి పెట్టి తెరిచి చూసాను.ఖరీదైన వాచీ. బట్టలు కొద్దిగా డబ్బులూ ఉన్నాయి. ఇవి ఎక్కడ దాచను అనుకుని కేంటీన్ యజమానికి దాచమని ఇచ్చాను.
'ఊ..ఇకనేం.. ఇదే పెట్టెలో ఒక జత బట్టలూ, రేజర్ సెట్టు వేసి స్టేషన్‌లో జనం ఎక్కువగా ఉన్న టైములో ఈ పెట్టె పట్టుకెళ్లి, అతని చేతిలోని పెట్టె తీసుకుని మెల్లగా ఈ పెట్టె అందించెయ్యి.దాంతో మనకి నిత్య పంట. దొరికావో నాలుగు దెబ్బలు వేస్తాడు. నీకేం భయం లేదు.'అన్నాడండి.తరచు అలా చేసేవాణ్ణి. అవన్నీ పుచ్చుకునేవాడు.అయ్యగారూ! కేంటీన్‌వాడు పెద్ద దొంగ.లేకపోతే కొవ్వూరి రాజుగారి నగలపెట్టె.శానా బంగారం ఉందండి. ఆయన చేతిలోంచి నా చేతిలోకి ఈజీగా లాగేసానండి. నా చేతిలో పెట్టె అందించేసాను.తీరా కేంటీన్‌రూంలో పెట్టె తెరిచి చూసాక భయమేసింది.అప్పటికే స్టేషన్‌లో నగలపెట్టె పోయిందని గొడవ జరుగుతోంది.భయమేసి వణికిపోయాను. ఆ పెట్టెలోని బంగారం చూసి కళ్లు మెరిసిపోయాయి మా యజమానికి. ఇప్పుడే వస్తాను అంటూ క్షణంలో

మాయమైపోయాడు ఆ పెట్టెతో.తిరిగి వచ్చాక "ఎవరికేనా చెప్పావో నిన్నే పోలీసులు పట్టుకుపోతారు"అని భయపెట్టాడు."అన్నాడు కుర్రాడు.

ఏడుపు కాస్త ఆగింది.-మనసులో బాధ చెప్పుకున్నాక.

వెంకట్రావు అంతా విన్నాక, "ఇదా సంగతి! సరే పద నీకు కడుపునిండా అన్నం పెట్టిస్తాను"అని చెప్పి తిన్నగా పోలీసు స్టేషనుకి తీసుకు వెళ్లాడు పారిపోకుండా గట్టిగా చేత్తో పట్టుకుని మెల్లగా కబుర్లు చెబుతూ.

"ఇలా తీసుకు వెడుతున్నారేమిటి.అన్నం పెట్టిస్తానన్నారు?"అని పారిపోవడానికి ప్రయత్నించాడు.

వెంటనే సి.ఐ.డి.వెంకట్రావు అథారిటీతో కేక వేసాడు "వీడి చేతికి బేడీలేయండి. వెంటనే వెళ్లి కేంటిన్ యజమానికి బేడీలు వేసి తీసుకు రండి"అని ఆజ్ఞాపించాడు.

కేంటీన్ యజమానిని తీసుకువచ్చారు పోలీసులు.

"మొదట్నుంచీ ఈ ముష్టివాడు ఏదో ప్రమాదం తీసుకువస్తాడనిపించింది."అనుకున్నాడు కేంటీన్‌యజమాని.ఇంతలోనే కేంటీన్‌లోని కుర్రాడు కనిపించాడు.

"ఓరివెధవా! ఇదంతా నీ పనా?"అని బాధపడ్డాడు.

"వెధవా!రాస్కెల్! బంగారపు నగలు ఎక్కడ దాచావో చెప్పు"అంటూ లాఠీతో కొట్టారు పోలీసులు.

ఎంతకొట్టినా 'నాకు తెలియదు'అన్నాడు యజమాని.

"ఇలాకాదు. వీడికి తిండి పెట్టకుండా రాత్రంతా నిద్ర పోనీయకండి. అప్పుడు నిజం చెప్తాడు."అన్నాడు వెంకట్రావు.

రెండు రాత్రిళ్లు అయ్యేసరికి తిండిలేక నిద్రలేక డస్సిపోయి నిజం చెప్పేసాడు యజమాని.

"తప్పుఅయిపోయింది బాబోయ్"

వాడి ఇంట్లో వంట గదిలో ఇత్తడి బిందెలో నగలన్నీ వేసి దాచానని చెప్పాడు.పోలీసులు వెళ్లి, ఆ నగలు వెతికి పట్టుకు వచ్చారు.కొవ్వూరు రాజుగారికి నగలు దొరికినట్లు ఫోన్ చేసారు.దొంగని లాకప్‌లో పెట్టి నగలు కోర్టువారికి హేండోవర్ చేసాక సి.ఐ.డి.వెంకట్రావుకి పెద్ద భారం తీరినట్లయింది.

పై ఆఫీసర్ల దగ్గరనుండి అభినందనలు వచ్చాయి.

"మీలాంటి వారున్నారుకనుకే పోలీసు డిపార్టుమెంటుకి మంచిపేరు వస్తోంది"అన్నారు

రాజుగారు.

"మీ నగలమీద పేర్లు వేయించారు కనుక పట్టుకోగలిగాం" అన్నాడు నవ్వుతూ వెంకట్రావు.

❄❄❄

(జ్యోతి మాసపత్రిక 1985)